రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్, ఓఎల్‌సీసీ, పీడీసీ తదితర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 26లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహిళలతో కలిసి చాయ్ తాగుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కాలనీల అభివృద్ధే లక్ష్యం

- ఎన్టీఆర్‌నగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి
- ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశాం.. ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి
- ఎన్టీఆర్‌నగర్ పర్యటనలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, జూలై 22: ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-3లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-3లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చిన ఎల్క్ట్రికల్ పోల్స్‌కు ప్రపోజల్ పెట్టి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కాలనీలో మిగతా ఏమైనా సమస్యలు ఉంటే వాటికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులు ఎన్నికల కోడ్ ఉన్నందున ఆగిపోయాయని, వాటిని త్వరలో ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయిందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడ కూడా పారిశుధ్యం లోపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారులు అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవిందశర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నాగేశ్, నాయకులు గొడుగు శ్రీనివాస్, న్యాల కొండ శ్రీనివాస్‌రెడ్డి, సాజీద్, కొండ్ర శ్రీనివాస్, రామ్‌నర్సింహాగౌడ్, శ్యామ్‌గుప్తా, శ్రీమన్నారాయణ, సిద్దగోని వెంకటేశ్‌గౌడ్, రమేశ్ కురుమ, పెంబర్తి శ్రీనివాస్, అనురాధ, జాహెద్, బాలుశ్రీ, శ్రీకాంత్‌గౌడ్, అఫ్సర్, ఇస్మాయిల్, మహేందర్ తదితరులు ఉన్నారు.

జేపీఎల్ షురూ..

హైదరాబాద్, ఆట ప్రతినిధి : కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) సీజన్-1 పోటీలు సోమవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఆరాంఘర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 10 టీవీపై టీవీ9 ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన 10టీవీ 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి గాను 116 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో టీవీ9 రెండు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ సాయికిశోర్(69) 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో ఎన్‌టీవీ 58 పరుగులతో సాక్షి టీవీపై ఘన విజయం సాధించింది.

పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం

మన్సూరాబాద్, జూలై 22: కాలనీల్లో పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి శివంహిల్స్‌కాలనీలోని పార్కు స్థలంలో రూ.2.90లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీగోడను నిర్మింపజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, కాలనీవాసులు ముకుందరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్, రామలింగారెడ్డి, రత్నాకర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, కడారి యాదగిరియాదవ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

శివంహిల్స్‌కాలనీలోని పార్కును పరిశీలిస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంకు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఆర్కేపురం, జూలై 22: ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మర్చాలని ముదిరాజ్ కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అసెంబ్లీ ఎన్నికలు-2023లో అభయ హస్తం మేనిఫెస్టో, కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సమావేశంలో రేవంత్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 15 సంవత్సరాల క్రితం అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌ల స్థితిగతులను పరిశీలించి రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయడంతో ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చారని గుర్తుకు చేశారు. తెలంగాణలోని ముదిరాజ్‌లు అనేక సంవత్సరాలుగా సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో నష్టపోతున్నారని తెలిపారు. ముదిరాజ్‌ల జనాభాలో అత్యధిక శాతం మత్స్యకార వృత్తి, తోటల పెంపకం, కావలికార్ వృత్తిపైన ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేసి 75శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ప్రకాశ్, రాజుపతి, నాగరాజు, రమేశ్, దేవేందర్‌ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి

మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు, జూలై 22: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ చేసిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం జిల్లా ముదిరాజ్ మహాసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రయ్య ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏ లోకి మారుస్తామని హామీ ఇచ్చారని.. ప్రభుత్వం ఏర్పడి 8నెలలు గడుస్తున్నా.. పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వివక్షతకు గురవతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని.. లేని పక్షంలో నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యువత అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బాబు రావు ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, మండల అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, కొర్వి సురేందర ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ కాకి రాములు ముదిరాజ్, శ్రీహరి ముదిరాజ్, గణేశ్ ముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, యాదయ్య ముదిరాజ్, సతీశ్ చంద్ర ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, సుదర్శన్ ముదిరాజ్, ప్రవీణ్ ముదిరాజ్, లింగం ముదిరాజ్ పాల్గొన్నారు.

సాయిసన్నిధి ఆలయం ఆధ్వర్యంలో రథోత్సవం

చైతన్యపురి ఫణిగిరి కాలనీ వెంకటసాయినగర్‌లోని సాయి సన్నిధి దేవాలయం ఆధ్వర్యంలో శ్రీ షిర్డి సాయిబాబా రథోత్సవం ఘనంగా జరిగింది. పుర వీధుల్లో బాబా వారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, హరిశంకర్, నర్సింహాప్రసాద్, పిల్లి గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - ఎల్బీనగర్, జూలై 22

ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన మేయర్

బడంగ్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో కృష్ణయ్య, అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి. చిత్రంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, జూలై 22: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చిన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఏ పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయని ఎంఈవో కృష్ణయ్య, వివిధ పాఠశాలల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను వారికి వివరించారు. ఏ హోదా లేని వాళ్లు అధికారులతో సమావేశాలు పెట్టడం, సమస్యల గురించి ఆరా తీయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. నిత్యం ప్రోటోకాల్‌పై రగడ జరుగుతున్నా వారి తీరు మారకపోవడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ఎల్బీనగర్ జోనల్ కార్యలయంలో ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సీసీపీ ప్రసాద్

హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య, అధికారులు

ఎల్బీనగర్, జూలై 22: ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం, హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చింది. అదే విధంగా హయత్‌నగర్ సర్కిల్‌కు సంబంధించి ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒక దరఖాస్తు చేసుకున్నారు. హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో పాటు అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

జింఖానాలో డ్రెస్సింగ్ రూమ్ ఆధునీకరణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సికింద్రాబాద్ జింఖానా క్రికెట్ స్టేడియంలో మహిళల డ్రెస్సింగ్‌రూమ్‌ను పూర్తిగా ఆధునీకరించారు. మహిళా క్రికెటర్ల సౌకర్యార్థం డ్రెస్సింగ్‌రూమ్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఎనిమిది చేంజింగ్ రూమ్స్‌కు మరమ్మతులు చేశారు. వీటిని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, హెచ్‌సీఏ సీనియర్ మెంబర్ ఆగమ్‌రావు, అకాడమీ డైరెక్టర్ విజయ్‌మోహన్ ప్రారంభించారు.

నిరుపేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

బండ్లగూడ, జూలై 22: కిస్మత్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ నీరుడు శ్రీశైలం ముదిరాజ్ తండ్రి నీరుడి విఠలయ్య వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, నోటు పుస్తకాలతో పాటు స్టేషరీ పంపిణీ చేశారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నీరుడు కుటుంబ సభ్యులు పెద విద్యార్థులకు అండగా నిలవడం సంతోషకమరని స్వామిగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ శేఖర్ ముదిరాజ్, ప్రధానోపాధ్యాయురాలు అమృత, ఉపాధ్యాయులు సక్కుబాయి, అనురాధ, నాయకులు సంగారెడ్డి, సదానంద్, సామి, సత్తయ్య, జగదీశ్, గోకరి అశోక్‌గౌడ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

హయత్‌నగర్ పరిధి బొమ్మరిల్లు నుంచి స్వాతిగార్డెన్ మార్గంలో రోడ్లపై వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్, జూలై 22: అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మరిల్లు నుంచి స్వాతి గార్డెన్ వరకు రోడ్లకు ఇరువైపులా వేసిన షెడ్లు, ర్యాంపుల వలన నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పరిసర కాలనీలవాసులు చేసిన ఫిర్యాదు మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం బొమ్మరిల్లు నుంచి స్వాతి గార్డెన్ వరకు సుమారు 20కి పైగా వేసిన షెడ్లు, ర్యాంపులను జేసీబీ సహాయంతో తొలగించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు సమయంలో ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. అక్రమ నిర్మాణాల వలన జరుగుతున్న ఇబ్బందులను ప్రజలకు తెలియజేసి అక్కడి నుంచి పంపించివేశారు. ఎలాంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా హయత్‌నగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ మన్సూర్ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు జరపడం ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణాల సమయంలో సెట్‌బ్యాక్ వదిలి నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టైన్‌మెన్లు శ్రీనివాస్, మహేందర్, సతీశ్, న్యాక్ సిబ్బంది సాయి, పాష తదితరులు పాల్గొన్నారు.

పోలీసునని చెప్పి.. బైక్‌తో పరార్

వెంగళరావునగర్, జూలై 22: పోలీసునని నమ్మించి.. బాధితుడిని పోలీస్ స్టేషన్ వరకు తీసుకొచ్చిన ఓ ఆగంతకుడు బైక్ తీసుకొని ఉడాయించాడు. ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం, మంధర్నకు చెందిన కె.నిఖిల్(21) నాలుగు రోజుల క్రితం స్విగ్గీ డెలవరీ బాయ్‌గా చేరాడు. ఆదివారం మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. మైత్రీవనం బస్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఏమైందని అడిగాడు. తాను పోలీసునని సమస్య చెప్పమన్నాడు. మొబైల్ పోయిందని నిఖిల్ చెప్పడంతో పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్తానని, ఫిర్యాదు చేయమన్నాడు. నిఖిల్ బైక్‌పై కూర్చున్న ఆగంతకుడు ఎస్ఆర్‌నగర్ పీఎస్‌కు తీసుకువెళ్లాడు. సెల్లార్‌లో అధికారులు ఉన్నారని తాను ఆలస్యంగా వచ్చానని, పై అధికారులు కొప్పడతారని చెప్పాడు. నువ్వు వెళ్లి ఫిర్యాదు చేయమని, తాను ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వరకు వెళ్లి స్టేషన్ రైటర్‌ను తీసుకొస్తానని నిఖిల్ బైక్ తీసుకుని వెళ్లాడు. అప్పటికే అనుమానం వచ్చిన నిఖిల్ ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఆగంతకుడిని వెంబడించాడు. కానీ ఫలితం లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మలక్‌పేట జలమండలి కార్యాలయంలో మూకుమ్మడి బదిలీలు

మలక్‌పేట, జూలై 22: మలక్‌పేట సబ్ డివిజన్ జలమండలి కార్యాలయంలో మూకుమ్మడి బదిలీలు జరిగాయి. మలక్‌పేట డీజీఎం(డిప్యూటీ జనరల్ మేనేజర్) ఇంద్ర శీలారాణి డివిజన్-6 బంజారాహిల్స్‌కు బదిలీ అవగా, పాత మలక్‌పేట డివిజన్ మేనేజర్ హష్మత్ అలీ అడిక్‌మెట్ ప్రాజెక్ట్ డివిజన్-3 మేనేజర్‌గా బదిలీపై వెళ్లగా, మూసారాంబాగ్ డివిజన్ మేనేజర్ చంద్రు నాయక్ నవోదయ కాలనీలోని కాకతీయనగర్ డివిజన్-3 కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఒకేసారి కార్యాలయంలోని అధికారులంతా బదిలీ అవటం చర్చనీయాంశంగా మారింది. ఇన్నాళ్లు మలక్‌పేట ప్రాంతంపై పూర్తి అవగాహన కలిగిన అధికారులు ఉండటంతో నీటి సరఫరా, మరమ్మతు పనులు, కొత్త పనులు చేపట్టాలన్నా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు సవ్యంగా జరిగేవని, ఇప్పుడు ఆ అధికారులంతా వెళ్లిపోవటంతో, బదిలీపై కొత్తగా వచ్చే అధికారులకు కొన్నాళ్లు తిప్పలు తప్పవని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇంద్ర శీలారాణి, డీజీఎం (డిప్యూటీ జనరల్ మేనేజర్)

హష్మత్ అలీ, పాత మలక్‌పేట డివిజన్ మేనేజర్

చంద్రునాయక్, మూసారాంబాగ్ డివిజన్ మేనేజర్

ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యం.. ఐదుగురి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 22: ప్రైవేటు పాఠశాలలను టార్గెట్ చేసుకొని విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకుంటూ దాడులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఐదుగురు నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ కథనం ప్రకారం.. కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ స్కూల్‌లోకి ఈ నెల 18న కొందరు వ్యక్తులు తెలంగాణ లీగల్ విద్యార్థులమంటూ ప్రవేశించారు. పాఠశాలలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు బెదిరింపులకు దిగారు. అనంతరం పాఠశాల యాజమాన్యం నుంచి డబ్బులు డిమాండ్ చేసి, వాటిని తీసుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారు. పాఠశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాల సహాయంతో నిందితులైన కార్తీక్ అలియాస్ బాలకోటి, సబ్బీప్, లక్ష్మీకాంత్‌చారి, ప్రవీణ్‌యాదవ్, పణయ్‌గౌడ్‌తో పాటు మరో ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మరో ఎనిమిది మంది కోసం గాలిస్తున్నారు.